క్లుప్తంగా

నేడు సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక

దేవరపల్లి: సెపక్ తక్రా స్త్రీ, పురుషుల జిల్లా జట్ల ఎంపిక మండలంలోని రామన్నపాలెం జెడ్పీ హైస్కూల్లో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జరుగుతాయని ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్ తెలిపారు. అనంతరం సెపక్‌తక్రా జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు.

మాదిగలు వారి ఇంటి పేర్ల - చరిత్ర పుస్తకావిష్కరణ



పైడిమెట్టలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ వీసీ, రిటైర్డ్ జిల్లా జడ్జి

తాళ్లపూడి: 'మాదిగల వారి ఇంటి పేర్లు - చరిత్ర ' అనే పుస్తకాన్ని మంగళవారం మండలంలోని పైడిమెట్ట గ్రామంలో ఆవిష్కరించారు. డాక్టర్ పీవీ రామ్ రచించిన ఈ పుస్తకాన్ని రిటైర్డ్ వైస్ చాన్సలర్ పి.జార్జి విక్టర్, రిటైర్డ్ జిల్లా జడ్జి గాంగేయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జార్జి విక్టర్, గాంగేయుడు తదితరులు మాట్లాడుతూ మాదిగల అస్తిత్వానికి, జాతి ఉన్నతికి ఇటువంటి రచనలు దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా పలు రచనలు చేసిన డాక్టర్ పీవీ రామ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పెనుమాక జయరాజు, బొల్లిపో మధు, డాక్టర్ పీవీ రవి రత్న ప్రకాశ్, జలమయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో అన్న సమారాధనలు

తాళ్లపూడి: దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ముగిసిన సందర్భంగా మండలంలోని రెండుచోట్ల మంగళవారం అన్న సమారాధనలు నిర్వహించారు. వేగేశ్వరపురంలోని దుర్గా సాయిరామ్ మేదర కులస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన చేశారు. సుమారు 4 వేల మంది వరకూ గ్రామస్తులు, అయ్యప్ప మాలధారులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే అన్నదేవరపేటలోని వేగేశ్వమ్మ తల్లి ఆలయం వద్ద ఉత్సవ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 4 వేల మందికి అన్నదానం చేశారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు: స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న వ్యాయామోధ్యాపక పోస్టును తాత్కాలిక ప్రాతిపదికపై భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి మంగళవారం తెలిపారు. 55 శాతం మార్కులతో ఎంపీఈడీ పీజీ పాసై, నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత గల అభ్యర్థులకు ఈ పోస్టు భర్తీలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. అర్హత గల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 17న కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

నిడదవోలు రూరల్: విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని గోపవరంలో రూ.25.24 లక్షలతో నిర్మించిన ఎంపీపీ పాఠశాల-1 నూతన భవనాన్ని మంత్రి దుర్గేష్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, ఎంఈఓలు కేవీ గణేశ్, పి.గురుమూర్తి, హెచ్‌ఎం ఎస్.శిరీషా, స్థానిక నాయకులు ఎ.చిననంగాలు, పి.దుర్గాప్రసాద్, గోపి తదితరులు పాల్గొన్నారు.

గోష్పాద క్షేత్రం పవిత్రతను కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగేంద్రకుమార్

కొవ్వూరు: రానున్న కార్తిక మాసాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక గోష్పాద క్షేత్రాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పురోహితులు, ఆలయ నిర్వాహకులు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ కోరారు. గోష్పాద క్షేత్రంలో పారిశుధ్య నిర్వహణపై మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో సమీక్షించారు.ఈ క్షేత్రం పవిత్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.పూజా ద్రవ్యాలను, వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పడవేయవద్దని సూచించారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆవులను, పశువులను వదలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పూజా వ్యర్థాలను డస్ట్‌బిన్లలో మాత్రమే వేయాలని కోరారు. మున్సిపల్ మేనేజర్ సాయిబాబా, ఇతర అధికారులు, పురోహితులు పాల్గొన్నారు.

పంట చేతికందే వేళ .. వాయుగండం

- డివిజన్‌లో వరికోతలు ప్రారంభం
- అల్పపీడన ప్రభావంతో డివిజన్ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- తాత్కాలికంగా వరికోతలు ఆపాలంటున్న అధికారులు



నల్లజర్ల మండలంలో ఖరీఫ్ వరి పంట కోస్తున్న యంత్రం



కొవ్వూరు మండలం కాపవరంలో ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న వరికోత యంత్రం

కొవ్వూరు: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి అందే వేళ వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు అన్నదాతలను కలవర పరుస్తున్నాయి. ఈశాన్య రుతు పవనాల ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. రానున్న రెండురోజుల్లో ఇది వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఈ ప్రభావంతో రానున్న నాలుగు రోజుల పాటు కోస్తా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఇప్పటికే కొవ్వూరు డివిజన్‌లో ఖరీఫ్ వరి కోతలు ప్రారంభం అయ్యాయి. వేలాది ఎకరాల్లోని పంటలు కోత దశలో ఉన్నాయి. ఇదే తరుణంలో మూడు రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం డివిజన్ వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం పడింది. వాయుగుండం, భారీవర్షాల హెచ్చరికలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాలం అనుకూలంగా ఉంటే ఈ నెలాఖరు నాటికి వరికోతలు దాదాపు ఓ కొలిక్కి వస్తాయి. ఇలాంటి సమయంలో అకాల వర్షాలు కురిస్తే చేతికొచ్చే పంటను కోల్పోవాల్సిన ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే భారీ వర్షాలు, ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువల ముంపు కారణంగా పంటలు ముంపు బారిన పడ్డాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికీ పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పంట నష్ట పరిహారమూ అందలేదు. ఇంతలోనే వాయుగుండం హెచ్చరికలు అన్నదాతను కలవర పరుస్తున్నాయి.

వడి వడిగా వరికోతలు

కొవ్వూరు డివిజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 39,620 హెక్టార్లు. ఇందులో 37,144 హెక్టార్ల విస్తీర్ణంలో వరినాట్లు వేశారు. ఇప్పటి వరకూ 356 హెక్టార్లలో వరికోతలు పూర్తయ్యాయి. డివిజన్‌లో గరిష్ఠంగా నల్లజర్ల మండలంలో 217 హెక్టార్లలో వరి కోతలు జరిగాయి. మండలాల వారీగా పెరవలిలో 20, కొవ్వూరులో 30, నిడదవోలులో 51, గోపాలపురంలో 10, దేవరపల్లిలో ఎనిమిది, చాగల్లులో 18, తాళ్లపూడిలో రెండు హెక్టార్లలో వరి కోతలు పూర్తి చేశారు. ఉండ్రాజవరం మండలం మినహా డివిజన్‌లో అన్నీ మండలాల్లోను వరి మాసూళ్లు ప్రారంభించారు.

డివిజన్ వ్యాప్తంగా వర్షం

కొవ్వూరు డివిజన్‌లో మంగళవారం ఉదయం ఎనిమిది గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాలవారీగా పెరవలిలో 20.6, ఉండ్రాజవరంలో 15.2, దేవరపల్లిలో 8.4, తాళ్లపూడిలో 8.2, నల్లజర్లలో 7.4, చాగల్లులో 6.2, గోపాలపురంలో 4.6, కొవ్వూరులో 3.4, నిడదవోలులో 4.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం నుంచి డివిజన్ వ్యాప్తంగా చెదురుమదురుగా వర్షం కురుస్తోంది.

వరికోతలు ఆపుకోవాలి



భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రైతులు తాత్కాలికంగా వరికోతలు ఆపుకోవాలి. నూర్చిన ధాన్యాన్ని వర్షానికి తడవకుండా సురక్షితమైన ప్రదేశంలో భద్రపరుచుకోవాలి. పొలంలో నీరు నిలవకుండా బయటకు వెళ్లే విధంగా డ్రయినేజీ ఏర్పాట్లు చేసుకోవాలి. అధిక వర్షం పడినట్టయితే వర్షం తగ్గిన వెంటనే ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పంటపై పిచికారీ చేసుకోవాలి.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

మద్యం కొత్తపాలసీ నేటి నుంచి అమల్లోకి..

దేవరపల్లి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు



మద్యం సీసాలు (ఫైల్)

దేవరపల్లి: ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన మద్యం పాలసీ బుధవారం ఉదయం నుంచి అమలులోకి వస్తోందని దేవరపల్లి ఎక్సైజ్ సీఐ బి. శ్రీనివాసరావు తెలిపారు. 2019లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన 17 ప్రభుత్వ మద్యం దకాణాలు మంగళవారం రాత్రి 9 గంటలకు ముగిసినట్టు తెలిపారు. వాటి స్థానంలో కొత్తగా సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో 14 మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ 14 మద్య దుకాణాలకు 775 దరఖాస్తులు రాగా లాటరీ పద్ధతిలో కొత్త దుకాణాలు కేటాయించినట్టు వివరించారు. పారదర్శకంగా లాటరీ విధానం అమలు చేసినట్టు చెప్పారు. మండలాలవారీగా దేవరపల్లిలో ఐదు , గోపాలపురంలో మూడు, నల్లజర్లలో ఆరు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. దేవరపల్లి మండలంలోని దుకాణాలను లాటరీలో సుంకర వీరవెంకట దుర్గారావు, పేరిచర్ల సత్యనారాయణరాజు, ఆరేపల్లి నరేష్, కొఠారు హేమ నాగ సత్య సురేంద్ర కుమార్, ఈడ్పుగంటి ఇంద్రాణీలు దక్కించుకున్నారు. గోపాలపురం మండలంలోని మూడు దుకాణాలను ఆలపాటి అరుణ్ కుమార్, నామన రవికుమార్, కొండేపాటి ఫణిబాబు దక్కించుకున్నారు. నల్లజర్ల మండలంలోని ఆరు దుకాణాలను పసుపులేటి పూర్ణచంద్రశేఖర్, చేదూరి మురళీకృష్ణ, దవులూరి శ్రీనివాసరారావు, కుప్పాల అనిల్‌కుమార్, కూచిపూడి సుబ్రహ్మణ్యం దక్కించుకున్నట్టు సీఐ వివరించారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి కొత్త దుకాణాల్లో మద్యం అమ్మకాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు



కొవ్వూరుపాడు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు



నల్లజర్ల మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో కమల్‌రాజ్

గోపాలపురం: సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను సరఫరా చేస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు అన్నారు. మండలంలోని కొవ్వూరుపాడు, కరగపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రాజారావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన టార్పాలిన్లు, బ్యాటరీ స్ప్రేయర్లు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు తేమ శాతాన్ని పరిశీలించుకున్న తర్వాత మిల్లులకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి కె.వివేక్, వివిధ శాఖల అధికారులు కొవ్వూరుపాడు, కరగపాడు రైతులు పాల్గొన్నారు.

రైతులు కోరిన మిల్లుకే ధాన్యం

నల్లజర్ల: ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని ర్యాండమైజేషన్ పద్ధతిలో కాకుండా రైతు కోరిన సమీప మిల్లుకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ రైతులకు వివరించారు. మంగళవారం నల్లజర్ల, మారెళ్ళమూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ ధాన్యం సేకరణకు 39 వేల గోనె సంచులను సిద్ధం చేశామన్నారు. ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉందంటూ గతంలో కొన్ని మిల్లుల వద్ద సొమ్ములో కోత విధించే వారని ఈ సందర్భంగా పలువురు రైతులు ఏవో దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే ట్రాన్స్‌పోర్టు, హమాలీల చార్జీలను ధాన్యం సొమ్ముతో పాటు తమ ఖాతాలకు జమ చేయాలని వారు కోరారు. తుపాను తీవ్రత తగ్గేవరకు రైతులు ఎవరూ వరి పంట కోయవద్దని ఏవో కమల్‌రాజ్ సూచించారు. నిమ్మ,కోకో, కొబ్బరి తోటలలో నత్తల నివారణ,ఆయిల్ పామ్, కొబ్బరి తోటలలో వచ్చే ఎర్రముక్కు పురుగు నివారణ చర్యల గురించి డాక్టరు వైఎస్సార్ యూనివర్సిటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శేషకిరణ్ రైతులకు వివరించారు. ఉద్యానశాఖాధికారి బబిత మాట్లాడుతూ ఉద్యాన తోటలకు సంబంధించిన సబ్సిడీ మొత్తాలు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. ఈ విషయంలో సందేహాలు ఉంటే తమను సంప్రదించాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లు ఏర్పాటుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.మార్కెట్ కమిటీ కార్యదర్శి సత్యనారాయణ, ఏఈఓ పుష్పలత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



నందమూరులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు: పల్లె పండుగ పేరుతో నిర్వహిస్తున్న పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. దొమ్మేరు గ్రామంలో రూ.4 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అలాగే నందమూరులో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు, పశివేదలలో రూ.23 లక్షలు, వేములూరులో రూ.23 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించే సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, ఎంపీడీవో కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: పల్లెపండుగ- పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని విజ్జేశ్వరంలో రూ.15.15 లక్షలు, కలవచర్లలో రూ.17.10 లక్షలు, జీడిగుంటలో రూ.13.50 లక్షలు, కోరుపల్లిలో రూ.13.62 లక్షలు, పెండ్యాలలో రూ.16.44 లక్షలు, మునిపల్లిలో రూ.18.44 లక్షలు, శెట్టిపేటలో రూ.15.05 లక్షలు, తాళ్లపాలెంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించే సిమెంట్ రోడ్లకు మంత్రి దుర్గేష్ మంగళవారం శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సర్పంచులు తిక్కా శ్రీనివాస్, మిద్దే మీనాక్షి, మొక్కరాల శ్రీను, గుత్తుల నాగలక్ష్మి, యర్రా రామకృష్ణ ఎంపీటీసీ సభ్యులు కర్రి సుజాత, వాకా శ్రీను, మండల ప్రత్యేకాధికారి దుర్గేష్, ఎంపీడీఓ డి.లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని ఘంటావారిగూడెం, దూబచర్ల, అయ్యవరం, ముసుళ్ళగుంట, పుల్లలపాడు, అచ్చన్నపాలెం గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పాల్గొన్నారు. గంటావారిగూడెంలో రూ.30లక్షలతో మూడు సీసీ రహదారులు, దూబచర్లలో రూ.27లక్షలతో మూడు సీసీ రహదారులు, అయ్యవరంలో రూ.10లక్షలతో మూడు సీసీ రహదారులు, ముసుళ్లగుంటలో రూ.10లక్షలతో ఒక సీసీ రహదారి, పుల్లలపాడులో రూ.10 లక్షలతో ఒక సీసీ రహదారి,అచ్చన్నపాలెంలో రూ.10 లక్షలతో కల్వర్టులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

అన్ని రంగాల్లో స్త్రీలు అభివృద్ధి సాధించాలి



దేవరపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మహిళా ప్రజాప్రతినిధులను సన్మానించన పాలకవర్గం

దేవరపల్లి: మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి అన్నారు. గ్రామీణ మహిళా దినోత్సవ వేడుకలను మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీరకుమారి మాట్లాడుతూ రాజకీయంగా మహిళలు అభివృద్ధి చెందినపుడే హక్కులను సాధించుకోవచ్చన్నారు. మహిళలపై రోజురోజుకూ లైంగిక దాడులు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వం మహిళల రక్షణకు చర్యలు తీసుకుని, పేట్రేగిపోతున్న మానవ మృగాలకు కఠిన శిక్షలు వేయాలని కోరారు. మహిళలు ఒంటరిగా ధైర్యంగా రోడ్డుపై తిరిగే పరిస్థితి లేదని అన్నారు. ఈ సందర్భంగా పాలకవర్గం సర్పంచ్ కడిమి వీరకుమారి, పంచాయతీ సభ్యులు చల్లా లక్ష్మి, గద్దే రమాదేవి, పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ వెలగా సాంబశివరావు, కార్యదర్శి నిట్టా రవి కుమార్, వార్డు సభ్యులు కైరం అప్పారావు, సచివాలయం కార్యదర్శి హరిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యులు కడిమి రాజు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రుచి మధురం... ధర ప్రియం

- అమ్మగుంట, చిక్కాల కేంద్రాలుగా ఎగుమతి
- గరువు భూముల్లో విస్తారంగా సాగు



విక్రయానికి ఉంచిన సీతాఫలాలు



ఊనగట్ల శివారులో అమ్మిగుంట సెంటర్‌లో ఎగుమతి కోసం వ్యాన్ ఎక్కిస్తున్న సీతాఫలాలు

చాగల్లు: ఈ ప్రాంతంలో పండే సీతా ఫలాలు ఎంత రుచిగా ఉంటాయో, రేటు కూడా అంతే ఎక్కువ. మండలంలో ఊనగట్ల, అమ్మగుంట, చిక్కాల, చిక్కాలపాలెం గ్రామాలు సీతాఫలాలకు ప్రసిద్ధి. మెట్ట ప్రాంత గ్రామాల గరువు పొలాల్లో తోటలు పెంచుతారు. సీతాఫలాల కాపు అక్టోబర్ నెలలో చేతి కొస్తుంది. మండలంలోని అమ్మగుంట, చిక్కాల కేంద్రాలుగా సీతాఫలాలు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి.

రూ.కోట్లలో వ్యాపారం

మండలంలో పండే సీతాఫలాలకు రుచి ఎక్కువ. అందుకే వాటిని కొనుగోలు చేయడానికి భీమవరం, తణుకు, గుడివాడ, రాజమహేంద్రవరం, విజయవాడ, ఏలూరు సహా పరిసర ప్రాంతాల వ్యాపారులు సీజన్‌లో రోజూ ఊనగట్ల, చిక్కాల వస్తారు. రైతులు తమ పొలాల్లో కాసిన సీతాఫలాలను మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తారు. పెద్ద వ్యాపారులు రోజుకు రూ.8 నుంచి రూ.10 లక్షల మేర వ్యాపార లావాదేవీలు జరుపుతారు. వారితో పాటు చిల్లర వ్యాపారులు కూడా సీతాఫలాలను కొనుగోలు చేసి కొవ్వూరు, నిడదవోలు పరిసర గ్రామాల్లో విక్రయిస్తారు.

ధర చాలా ఎక్కువ

సీతాఫలాలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఏడాదిలో నెల రోజులు మాత్రమే లభించే సీతాఫలాలను అందరూ ఇష్టంగా తింటారు. వర్షాల వల్ల ఈ ఏడాది కాపు (దిగుబడి) అధికంగా ఉంది. అయితే కాయలన్నీ ఒకేసారి పక్వానికి రావడంతో రైతులు వాటిని ఒబ్బిడి చేసుకోలేక ఇబ్బందులు పడ్డారు. ధర సీతాఫలాలు రూ.1500 నుంచి రూ.2,000 రేటుకు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు రిటైల్‌గా రూ.3000 నుంచి రూ.4000 వరకూ ధరకు అమ్మకాలు చేస్తున్నారు.

రెండు వేల ఎకరాల్లో సాగు

సీతాఫలాలకు గిరాకీ ఉండి మంచి రేటు కూడా లభిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో సీతాఫలాల తోటలు ఉన్నాయి. రైతులు తమ పొలాల్లో పండిన కాయలను కోసి సైకిళ్ల, మోటార్ సైకిళ్ల పై తీసుకొచ్చి వ్యాపారస్తులకు విక్రయిస్తారు. తాము కొనుగోలు చేసిన కాయలను వ్యాపారస్తులు మినీ వ్యాన్లపై పట్టణాలకు తరలించి అక్కడ అమ్మకాలు చేస్తారు.

వ్యాపారులకు ప్రయోజనకరం



ఈ సారి సీతాఫలాలు దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. ఇక్కడి కాయలు వివిధ పట్టణాలకు ఎగుమతి అవుతున్నాయి. రైతులకు అంతగా లాభాలు రాకపోయినా వ్యాపారులకు మాత్రం ప్రయోజనకరంగానే ఉంది.

– సంసాని రమేష్ , చిక్కాల

'విద్యా దీపిక ' పక్ష పత్రిక ఆవిష్కరణ



విద్యా దీపిక పక్ష పత్రిక సంచికను ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు సక్సేనారాజు, శారదా జ్యోత్స్న

ఉండ్రాజవరం: విద్యార్థుల్లో పఠనం పట్ల, రచనల పట్ల ఆసక్తి పెంచుతూ పత్రికను నిర్వహిస్తున్న సంపాదకుడు, తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణ ప్రసాద్ కృషిని ఎంఈఓ సక్సేనారాజు అభినందించారు. మండలంలోని మోర్త ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో నిర్వహిస్తున్న పక్ష పత్రిక విద్యా దీపిక 100వ సంచికను ఎంఈవో-2 శారదా జ్యోత్స్న, పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసులతో కలసి మంగళవారం సక్సేనారాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శారదా జ్యోత్స్న మాట్లాడుతూ పత్రిక నిరంతరాయంగా వెలువడుతూ విద్యార్థుల్లో జ్ఞాన తృష్ణను పెంచే విధంగా ఉందన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ పత్రిక నిర్వహణ సామాన్య విషయం కాదని, ఈ పత్రికను ఇంతవరకూ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణప్రసాద్‌ను పలువురు అభినందించారు.

అభ్యసన సమస్యలపై అవగాహన ర్యాలీ



చాగల్లులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

చాగల్లు: విద్యార్థులు ఎదుర్కొంటున్న 'అభ్యసన సమస్యల'పై చాగల్లులో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు యు.గురునాథం, ఐఏ శుభాకర్ మాట్లాడుతూ భవిత పాఠశాలలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి బుధవారం నిర్వహించే ఫిజియో థెరపీని దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు. తల్లితండ్రులు తమ పిల్లలకు అభ్యసన వైకల్యాలు సమస్యలు ఉన్నాయో లేదా పరిశీలించాలన్నారు. ఒక వేళ ఉంటే ఉపాధ్యాయులను సంప్రదించి వారి అభ్యసనకు దోహదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎం.శిరీష, సీహెచ్ నాగపూర్ణిమ, రామలక్ష్మి టీచర్లు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు నివాళి



గోపాలపురం మండలం పెద్దాపురం ఎంపీపీ స్కూల్‌లో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: మిస్సైల్ మేన్‌గా పేరొందిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మండలంలోని రాగోలపల్లి ప్రాథమిక పాఠశాల్లో ప్రధానోపాధ్యాయుడు డి. దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు కలాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

గోపాలపురం: నేటి యువత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పెద్దాపురం ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం కె.పోశియ్య అన్నారు. మంగళవారం ఆ స్కూల్‌లో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం పోశియ్య మాట్లాడుతూ పేపర్ బాయ్ నుండి రాష్ట్రపతిగా ఎదిగిన అబ్దుల్ కలాం జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ కొయ్య నాగరాజు, ఉపాధ్యాయులు ఎస్.రాజశేఖర్, జగతా శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

షెడ్ల నిర్మాణానికి రూ.40 లక్షలు

నిడదవోలు: పట్టణంలోని వీక్లీ మార్కెట్‌లో షెడ్‌ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి మంగళవారం తెలిపారు. వీధి వ్యాపారులకు ఆర్థిక పరిపుష్టి, మార్కెట్‌లో మౌలిక వసతుల కల్పనకు మెప్మా నిధులు రూ.40 లక్షలు మంజూరైనట్టు ఆమె వెల్లడించారు. ఈ నిధులతో మార్కెట్‌లో మూడు షెడ్‌లు, అంతర్గత రోడ్లు నిర్మిస్తామన్నారు. వీధి వ్యాపారుల సంక్షేమం కోసం మెప్మా ద్వారా మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు ఆమె తెలిపారు.